నిర్వహణ సాగేదెలా?

- అంగన్‌వాడీ కేంద్రాలపై కూటమి సర్కార్ నిర్లక్ష్యం
- మూడేళ్ల క్రితం ధరలకు అనుగుణంగానే బిల్లుల చెల్లింపు
- పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో నిర్వాహకులు సతమతం



గుమ్మరేవుల పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రంలో భోజనాలు చేస్తున్న పిల్లలు

పాడేరు డివిజన్‌లో

ఐసీడీఎస్ ప్రాజెక్టులు	:	11
అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య:		2,231
గర్భిణులు	:	6,000
బాలింతలు	:	7,545
ఆరేళ్ల లోపు చిన్నారులు		:11,09,752

సీలేరు: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం కోసం అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో సేవలందిస్తున్నాయి. వారికి రోజూ పౌష్టికాహారాన్ని అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ నిర్వహణ పెద్ద పాత్ర పోషిస్తోంది. అయితే ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ కష్టతరంగా మారిందని పలువురు చెబుతున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా బిల్లుల మంజూరు లేకపోవడంతో కార్యకర్తలకు భారంగా మారింది. అంగన్‌వాడీ కేంద్రాలకు బిల్లులు పెంచుతామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలుచేయకపోవడంతో నిర్వహణ కోసం నానా అవస్థలు పడుతున్నారు. పెరిగిన ధరలతో రోజూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంగన్వాడీ కేంద్రాల నిర్వహణపై కనీసం దృష్టి సారించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, ఖర్చులు భారీగా పెరగడంతో కార్యకర్తలకు భారంగా మారింది. అసలే వారి జీతాలు అంతంత మాత్రంగా ఉంటే, దీనికి తోడు పాత ధరల ఆధారంగా బిల్లులు చెల్లిస్తుండడంతో వంట ఖర్చులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చిన ప్రీ స్కూలు పిల్లల ఆహారం కోసం కూరగాయలు, ఆకుకూరలు, పసుపు, చింతపండు, కారంపొడి తదితర సామాగ్రి ఎప్పటికప్పుడు సిద్ధం చేసుకోవాలి. అయితే వీటి కొనుగోలుకు ఒక చిన్నారికి నెలకు రూ.50 ప్రభుత్వం చెల్లిస్తోందని చెబుతున్నారు. అయితే ఇది ఏమాత్రం సరిపోవడం లేదని ఆరోపిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం చేస్తున్న చిన్నారులు వాపోతున్నారు. రోజుకు ఒకరికి కూరగాయల కోసం రూ.1.50, గ్యాస్ నెలకు రూ.450 చొప్పున ఇస్తున్నారు. అయితే ప్రస్తుతం సిలిండర్ ధర రూ. 950లకు కొనుగోలు చేస్తున్నామని, పెరిగిన ధరల కారణంగా మెను ప్రకారం వండి పెట్టాలంటే అదనపు భారం తప్పడం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మెను ప్రకారం బిల్లులు

2022 ఫిబ్రవరి ధరలకు అనుగుణంగా ప్రస్తుతం బిల్లులు చెల్లిస్తున్నారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ కోసం కోట్లాది రూపాయలను వెచ్చించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ బిల్లులను అంతకు ముందు ఉన్న టీడీపీ ప్రభుత్వం కంటే ఎక్కువగా అందించింది.దీంతో నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ చాలా సంతృప్తికరంగా సాగింది. నాడు వైఎస్సార్‌సీపీ పాలనలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ తీరు దేశానికి ఆదర్శంగా నిలిచింది. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అంగన్‌వాడీ కేంద్రాలను విస్మరించిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఒక వైపు నిత్యావసర సరుకులు ఆకాశాన్నంటిన ధరలు మూడు రెట్లు పెరగడంతోపాటు గ్యాస్ ధర కూడా బిల్లులు చెల్లించిన దానికంటే అదనంగా రూ.500 పెరిగిందని నిర్వాహకులు చెబుతున్నారు. మెను ప్రకారం వండి పెట్టాలంటే తమకు భారంగా ఉందని, ప్రస్తుత ధరల ప్రకారం బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు.

మెనూ ఇలా..

సోమవారం	దోసకాయ పప్పు
మంగళవారం	టమోటా పప్పు
బుధవారం	ఆకుకూర పప్పు
గురువారం	కూరగాయలతో సాంబారు
శుక్రవారం	బీరకాయ లేదా సొరకాయ పప్పు
శనివారం	వెజిటబుల్ బాత్ రైస్

ప్రభుత్వం స్పందించాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ సెంటర్ ద్వారా గిరిజనులు ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో కేంద్రాల ద్వారా మెరుగైన ఆహారాన్ని అందిస్తున్నారు. అయితే చాలీచాలని రేట్లుతో భోజనాలు పిల్లలకు వడ్డించడంతో నాణ్యమైన భోజనం అందడం లేదు తక్షణమే రేట్లు పెంచాలి. దీనిపై ప్రభుత్వం స్పందించాలి.

– సుంకరి విష్ణుమూర్తి, సీపీఎం నాయకుడు, దారకొండ

మొరాయిస్తున్న ఆర్టీసీ బస్సులు

ప్రయాణికులకు తప్పని పాట్లు



రాజవొమ్మంగిలో రెండు రోజులుగా నిలిచి ఉన్న రాజమహేంద్రవరం డిపోకు చెందిన బస్సు

రాజవొమ్మంగి: తరచు మార్గమధ్యలో ఆగిపోతున్న ఆర్టీసీ బస్సులతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. రాజవొమ్మంగి యూనియన్ బ్యాంకు వద్ద రెండు రోజుల క్రితం రాజమహేంద్రవరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మొరాయించి, నిలిచియింది. సోమవారం నర్సీపట్నంలో బయలుదేరిన ఈ బస్ సాయంకాలం నాలుగు గంటలకు రాజవొమ్మంగి చేరుకొని అక్కడ నుంచి రాజమహేంద్రవరం వెళ్లాల్సి ఉంది. కాగా ఈ బస్సు కృష్ణదేవిపేట వద్ద చింతాలమ్మ ఘాట్ వద్ద ఒకసారి, రాజవొమ్మంగిలో మరోసారి సాంకేతిక సమస్యతో నిలిచిపోయింది. బస్సులోని సుమారు 60 మంది ప్రయాణికులు చంటి పిల్లలు, వృద్ధులతో నానా ఇబ్బంది పడ్డారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతూ వేరే బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో తమ గమ్య స్థానాలకు చేరుకున్నారు. అయితే సోమవారం నుంచి మంగళవారం మధ్యాహ్నం 2 గంటల వరకు ఆ బస్సు అక్కడే నిలిచిపోయింది. ఇదే బస్ రెండు రోజుల క్రితం రాజమహేంద్రవరం నుంచి రాజవొమ్మంగి మీదుగా నర్సీపట్నం వెళ్లాల్సి వుండగా అడ్డతీగల మండలం గొంతువానిపాలెం వద్ద సుమారు రెండు గంటల కొద్దీ నిలిచిపోయినట్టు ప్రయాణికులు తెలిపారు. చివరికి ఈ బస్ చాలా ఆలస్యంగా రాజవొమ్మంగి, ఆ తరువాత నర్సీపట్నం వెళ్లింది. ఇదిలా ఉండగా మంగళవారం ఏలేశ్వరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్ కొయ్యూరు మండలం రేవళ్ల నుంచి రాజమహేంద్రవరం వెళ్లాల్సి ఉండగా, మార్గ మధ్యలో గొంతువానిపాలెం వద్ద నిలిచిపోయింది. ఇలా తరచు ఆర్టీసీ బస్‌లు మార్గమధ్యలో మొరాయిస్తుండడంతో విసుగెత్తిపోతున్నామని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి ఏజెన్సీ ప్రాంతంలో కండిషన్‌లో ఉన్న బస్సులను నడపాలని వారు కోరుతున్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



రామాలయం వీధిలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ బాలయ్యపడాల్, సర్పంచ్ పుష్పలత

చింతపల్లి: మండల కేంద్రంలో రూ.10 లక్షల జిల్లా పరిషత్ నిధులతో అభివృద్ధి నిర్మాణ పనులు చేపడుతున్నట్టు జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య పడాల్ అన్నారు.మంగళవారం సర్పంచ్ దురియా పుష్పలతతో కలిసి రామాలయం వీధిలో సీసీ రోడ్డు, ఎస్సీకాలనీలో కమ్యూనిటీ భవన మర మ్మత్తు నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5 లక్షలతో రోడ్డు, మరో రూ.5 లక్షలతో ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ భవన మరమ్మతుకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే చింతపల్లి పంచాయతీలో అభివృద్ధ పనులకు రూ.1.5కోట్లు జిల్లా పరిషత్ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.అదే విధంగా చాడిపేటలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.10 లక్షలు మంజూరైనట్టు తెలిపారు. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించిన్నట్టు తెలిపారు. సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీటీసి నాగలక్ష్మి, కో–ఆప్షన్ సభ్యుడు నాజర్‌వల్లి, వార్డు సభ్యులు అప్పలనాయుడు, బుజ్జి, సత్యనారాయణ పాల్గొన్నారు.

కులరహిత సమాజానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న దూలయ్య

రంపచోడవరం: సమాజాన్ని పట్టి పీడిస్తున్న కుల, వర్ణ, జాతి వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా కులరహిత సమాజాన్ని నిర్మించుకోవాలిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి కుంజా దూలయ్య అన్నారు. రంపచోడవరంలోని పార్టీ కార్యాలయంలో డివిజన్ నాయకుడు పల్లాల అశోక్ అధ్యక్షతన కుల నిర్మూలన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దూలయ్య మాట్లాడుతూ జ్యోతి రావు పూలే స్థాపించిన సత్యశోదక్ సమాజ్ ఆవిర్భావం సందర్భంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దళితులు, ఆదివాసీలు, పేదలు రాజ్యాంగ పరిరక్షణ హక్కులు కోసం పోరాడాలన్నారు. అఖిల భారత రైతుకూలీ సంఘం కార్యదర్శి పల్లాల లచ్చిరెడ్డి మాట్లాడుతూ కులం, మతం పేరుతో పేదలను విభజించి దోపిడీ, దౌర్జన్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఆచార, సంప్రదాయాలను కూడా పాటించకుండా నిషేదిస్తూ ,పాటించిన వారిపై హత్యలు, దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు బాలురెడ్డి, రమణ, మాధవరెడ్డి, రాములమ్మ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు తగవు



అడ్డతీగలలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

అడ్డతీగల: అడ్డతీగలలో మంగళవారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు, పార్టీ ప్రజాప్రతినిధులు డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల కేంద్రంలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ఎదుట ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బొడ్డపాటి రాఘవ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతుందన్నారు. ఇది తగదన్నారు. పార్టీ కార్యకర్తలపై పెడుతున్న అక్రమ కేసులు, ఇబ్బందులను చూసి వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యూర్ కోడ్ డిజిటల్ బుక్‌ను ప్రవేశపెట్టారన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు వేధింపులు, అక్రమ కేసులకు గురైన వెంటనే ఈ యాప్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవి ఆలయ గోపుర నిర్మాణానికి విరాళం

మాడుగుల: స్థానిక ఆర్‌ఎంసీ హైస్కూల్‌లో 1999– 2000 సంవత్సరంలో టెన్త్ చదివిని విద్యార్థులు మంగళవారం దేవి ఆలయ గోపుర నిర్మాణానికి రూ.28 వేలు విరాళంగా అందజేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, ఎస్.వి.రావు, దేవరాపల్లి శ్రీనివాస రావు, మోటారు యూనియన్ సభ్యులుతో పాటు పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన బతుకమ్మ సంబరాలు



గౌరిదేవిపేటలో బతుకమ్మ వేడుకలో భక్తులు

ఎటపాక: బతుకమ్మ సంబరాలు సోమవారం రాత్రితో వైభవంగా ముగిశాయి. తొమ్మిదిరోజులుగా బతుకమ్మ వేడుకలు మండలంలోని వివిధ గ్రామాల్లో ఆనందోత్సాహాల నడుమ మహిళలు జరుపుకున్నారు. రోజుకో విధంగా బతుకమ్మలను తయారు చేసి గ్రామంలోని మహిళలంతా బతుకమ్మలను ఓ చోట చేర్చి ఆటపాటలతో వేడుకలు నిర్వహించారు. చివరిరోజు సద్దుల బతుకమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆట పాటలతో ఊరేగింపుగా సమీపంలోని నీటి వనరుల్లో నిమజ్జనం చేశారు. మండలంలోని గౌరిదేవిపేట, నంది గామ, మురుమూరు, గన్నవరం, తోటపల్లి, నెల్లిపాక తదితర గ్రామాల్లో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ఇంటి గోడ పక్కన కూలిన చెట్టు



వేలాడుతున్న విద్యుత్ వైర్లు

- భారీ వర్షానికి కూలిన చెట్టు
- దెబ్బతిన్న ఇల్లు

సీలేరు: అల్లూరి జిల్లాలో మంగళవారం ఉదయం ఎడతెరిపి లేకుండా నాలుగు గంటల పాటు కురిసిన భారీ వర్షానికి గిరిజన గ్రామాలు అన్నీ అతలాకుతలమయ్యాయి. ఇందులో భాగంగా సీలేరు దారకొండ గుమ్మరేవుల దుప్పులవాడ పంచాయతీ పరిధిలో పలు గ్రామాల్లో పంట పొలాల్లోకి భారీగా వర్షపు నీరు చేరింది. దారకొండ పంచాయతీ రోలుగుంట గ్రామంలో కిలో గాసి రామ్ ఇంటిపై గోడపై పక్కనే ఉన్న భారీ వృక్షం కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో 15 మంది వరకు ఉన్నారని యజమాని చెప్పారు. పెద్ద శబ్దానికి ఇంటి నుంచి పరుగులు తీశామన్నారు. ఈ ఘటనలో ఇంటి గోడ రేగులు పాక్షికంగా దెబ్బతిందని, చెట్టు ఇంటిపై కూలి ఉంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని, త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పిందని చెప్పారు.

నిలిచిన విద్యుత్ సరఫరా.. అంధకారంలో గ్రామాలు

మండలంలో ఏ.దారకొండ పంచాయతీ గొల్లపల్లి. పెబ్బంపల్లి. తడకపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పాత కేబుల్ వైర్లు గ్రామానికి వేయడం వలనే వర్షాలు కురిసినపుడు ప్రతీసారి విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తక్షణమే అధికారులు స్పందించి కొత్త వైర్లు వేసి విద్యుత్ సరఫరాకి ఇబ్బందులు లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దుర్గాదేవి.. నమోస్తుతే



పెదబయలులో పూజలు చేస్తున్న భక్తులు



దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు



అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి,డాక్టర్ నరసింగరావు. ఆలయ ధర్మకర్త సింహాచలం నాయుడు, భక్తులు



పాడేరులో మహాలక్ష్మి ఆలయంలో దీపార్చన చేస్తున్న మహిళలు



చింతపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు



తోటపల్లిలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు, అధికారులు



పెదబయలులో అన్నసమారాధనలో భక్తులు

- ఘనంగా శరన్నవరాత్రులు
- అమ్మవారికి ప్రత్యేక పూజలు
- భక్తిశ్రద్ధలతో దీపారాధన

సాక్షి,పాడేరు: కనకదుర్గమ్మతల్లి శరన్నవరాత్రుల వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పలు దేవతామూర్తులు మంగళవారం దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అరకులోయలోని భ్రమరాంబికదేవి, పాడేరులోని రాజరాజేశ్వరి, మహాలక్ష్మి ఆలయాల్లో విగ్రహాలను దుర్గాదేవిగా అలంకరించి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రాజరాజేశ్వరిదేవికి ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, డాక్టర్ తమర్బ నరసింగరావు, ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు, రమాదేవి, ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటరత్నం, వైదేహి దంపతులు తదితరులు అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. మహాలక్ష్మి ఆలయంలో భక్తులు దీపార్చన చేశారు.

చింతపల్లి: దుర్గాదేవి దసరా శవన్నవరాత్రులు ఉత్సవాల్లో బాగంగా మంగళవారం శ్రీ దుర్గాదేవి అవతారంతో భక్తులకు దర్శన మిచ్చింది.మండల కేంద్రంలో రంగా సెంటర్,అనాదీశ్వర ఆలయం, బైలుకించంగి రోడ్డు వీధి, రత్నగిరికాలనీతో పాటు గొందిపాకులు గ్రామాల్లో నెలకొల్పిన అమ్మవారి మండపాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

పెదబయలు: పెదబయలు మండలం కేంద్రంలో మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రులు సందర్భంగా అమ్మవారి మండపంలో మంగళవారం పూజలు చేశారు. ఉదయం నుంచి అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలకు పంపిణీ చేశారు. పెదబయలు హరి హరపుత్ర మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు పూర్ణయ్య, అంజిబాబు, రాము, లాలీబాబుకిశోర్, మాజీ సర్పంచ్ దడియా రాంబాబు, వర్తకులు,మోటర్ యూనియన్ సభ్యులు తదితరులు పర్యవేక్షించారు. మండలంలోని కిముడుపల్లి గ్రామంలో మంగళవారం దసర నవరాత్రుల సందర్భంగా దుర్గాదేవి వేషధారణలో పిల్లలకు ఆలంకరణ చేసి పూజలు నిర్వహించారు.గ్రామంలో జై దుర్గా జైజై దుర్గా అంటు పెద్ద ఎత్తున అంటూ గ్రామ శివకేశవస్వాముల ఆలయం నుంచి గ్రామంలో విదుల్లో ఊరేగింపుగా వెల్లారు.ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు,మహిళలు పాల్గొన్నారు.

ఎటపాక: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు దుర్గాదేవి అవతారంగా భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని తోటపల్లి, నెల్లిపాక,గన్నవరం చోడవరం గ్రామాల్లో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తోటపల్లిలో జైమాత యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో భక్తులతో కలిసి సీఐ కన్నపరాజు, తహసీల్దార్ సుబ్బారావు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం మండపం వద్ద అన్న సమారాధన నిర్వహించారు.

రాజవొమ్మంగి: దుర్గాష్టమి పండుగను మంగళవారం ఘనంగా, భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. రాజవొమ్మంగి శివాలయం కొండపై, లాగరాయి, శరభవరం, దూసరపాము, జడ్డంగి గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో అమ్మవారు శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. గ్రామాల్లో భవానీ మాలధారులు విజయవాడలోని ఇంద్రకీలాద్రికి పయనమయ్యారు. దుర్గాష్టమి సందర్భంగా ప్రతి గ్రామంలో, ఇళ్లల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

క్లుప్తంగా

భవన నిర్మాణ కార్మికుల మహాసభ నేడు



మహాసభ కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

రాజవొమ్మంగి: రంపచోడవరంలో బుధవారం జరుపతలపెట్టిన భవన నిర్మాణ కార్మికుల జిల్లా మహాసభను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పుట్టా రామరాజు పిలుపునిచ్చారు. మంగళవారం ఈ మేరకు రాజవొమ్మంగిలో మహాసభకు తరలిరావాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్మికుల సమస్యలను పోరాటంతోనే సాధించుకొందాం, అందరు ఐఖ్యతతో ముందుకు రావాలని రామరాజు పిలుపునిచ్చారు. తాపీ మేస్త్రీల సంఘం అధ్యక్షుడు సిగిరెడ్ల వీరబాబు తదితర కార్మిక నాయకులు పాల్గొన్నారు.

సారాతో ఒకరి అరెస్ట్

కొయ్యూరు: చింతలపూడి సమీపంలో సారా విక్రయిస్తున్న యల్లంకి చిన అప్పారావును పది లీటర్ల సారాతో అరెస్టు చేసినట్టు ఎస్ఐ కిషోర్‌వర్మ మంగళవారం తెలిపారు.సారా విక్రయిస్తున్నట్టు అందిన సమాచారంతో తనిఖీలు చేయగా అప్పారావు సారాతో దొరికాడన్నారు. అప్పారావుది ఆడాకుల గ్రామమని ఎస్ఐ కిషోర్‌వర్మ చెప్పారు.

అమ్మవారికి పట్టువస్త్రాలు అందజేత



బాపనమ్మ తల్లికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి

రంపచోడవరం: దసరా ఉత్సవాల్లో భాగంగా మండలంలోని సీతపల్లి బాపనమ్మ అమ్మవారికి ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి దంపతులు మంగళవారం పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు బత్తిన కోటేశ్వరరావు, ఆలయ అధికారి గండేపల్లి సత్యరమేష్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ బాపన్నదొరలు ఆలయ మర్యాదలు, పూర్ణ కుంభంతో వారికి స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ: మండలంలోని కురిడి పంచాయతీ గడభగలుంగు గ్రామంలో వైఎస్సార్‌సీపీ అభిమాని రేఖ మాతృమూర్తి తడబారికి రాధమ్మ (71) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మంగళవారం గ్రామానికి వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఆయన వెంట వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు మురళీమోహన్ పట్నాయిక్, నాయకులు బాకా సింహాచలం, చటారి కృష్ణారావు, పంచాయి నరేష్, తదితరులున్నారు.

నిరుపయోగంగా బస్ షెల్టర్లు



బొక్కెలు గ్రామంలో నిరుపయోగంగా బస్ షెల్టర్

పాడేరు రూరల్: మండలంలో ఇరాడపల్లి పంచాయతీ పాడేరు– జి మాడుగుల ప్రధాన రహదారి బొక్కెలు గ్రామంలో ఉన్న బస్ షెల్టర్ నిరుపయోగంగా మారింది, ప్రయాణికులు విశ్రాంతి తీసుకునేందుకు కూడా వీలు లేకుండా పాడుబడి అధ్వానంగా మారింది. పెదబయలు, జి.మాడుగుల, మండలాలకు సంబంధించిన గ్రామాలతో పాటు ఇరాడపల్లి పంచాయితీ రాయిగెడ్డ, కొలంబో, సాకుపుట్టు, ఇస్కగరువు తదితర సుమారు 20 గ్రామలకు సంబంధించిన గిరిజనులు బొక్కెలు కేంద్రంలోనే వచ్చి పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. బస్సు షెల్టర్ లేకపోవడంతో ఎండైనా..వానైనా ఆరుబయటే బస్సుల కోసం గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాడైన బస్సు షెల్టర్‌కు మరమ్మతు చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బస్ షెల్టర్‌ను బాగు చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.